సాక్షి
విశాఖపట్నం
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం
ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు బుధవారం ఏయూ గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యాయి. 8లో



పలు రైళ్లకు అదనపు కోచ్‌లు
ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల కోసం పలు రైళ్లకు కోచ్‌లను జతచేస్తున్నారు. 8లో



ముమ్మర సాధన 8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.24 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 35 రోజులకు గాను 2 కోట్ల 24 లక్షల 90వేల 276 రూపాయలు వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 143 గ్రాముల బంగారం, 14 కిలోల వెండి లభించినట్టు ఈవో పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

3న ఐఎన్‌ఎస్ సంధాయక్ ప్రారంభం



సింథియా: ఐఎన్‌ఎస్ సంధాయక్(జే18) ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 3న నేవల్ డాక్‌యార్డ్‌లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ నౌకను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నౌక కోల్‌కత్తాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో డిజైన్ చేశారు. ఈ ఓడ సుమారు 3800 టన్నుల స్థానభ్రంశం కలిగి, రెండు డీజిల్ ఇంజిన్ల ద్వారా కావాల్సిన శక్తిని పొందుతుంది. 18 నాట్లు వేగంతో 25 రోజులకు పైగా ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2021 జూన్ 4న నిలిపివేసిన సంధాయక్ ఓడకు ప్రతిరూపంగా ఈ నౌకను తీర్చిదిద్దారు. చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అడ్మిరల్ హరికుమార్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

రేపు 'టిడ్కో' గృహ ప్రవేశాలు



టిడ్కో గృహాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ఆనందపురం: మండలంలోని దబ్బందతో పాటు మరో ఐదు ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లల్లో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. ఆయన బుధవారం దబ్బందలో పర్యటించారు. దబ్బందలో 1,920 గృహాలు, మరో ఐదు ప్రాంతాల్లో 2,160 గృహాలు మొత్తంగా 4,080 ఇళ్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు తాళాలు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. ఎస్ఈ డి.నరసింహమూర్తి, ఏఈ డి.సుధాకర్, డీఈఈలు పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగుల సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆమోదం మేరకు ఎన్నికల అధికారి పి.రేఖా జ్యోతిర్మయి బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 15న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఎన్నికలు నిర్వహిస్తారు. 9 మంది సభ్యులను ఎన్నుకునే నిమిత్తం బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు జరుగుతాయి. ఇందుకోసం ఈ నెల 6న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారు. 7న నామినేషన్లు పరిశీలన ఉంటుంది. 8న నామినేషన్లు ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న వారి పేర్లు ప్రకటించి, వారికి ఎన్నికల గుర్తు కేటాయిస్తారు. 15న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు సాయంత్రం లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో మెరిట్‌జాబితా

ఏయూక్యాంపస్ : ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేస్తున్న స్టాఫ్‌నర్స్ పోస్టులకు సంబంధించి ప్రొవిజనల్ జాబితాను www.visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోగా తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

మెగా డీఎస్సీ జోష్



పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

- టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- క్యాబినెట్ ఆమోదంతో సర్వత్రా చర్చ
- అభ్యర్థుల్లో ఆనందోత్సవాలు

విశాఖ విద్య: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మెగా డీఎస్సీ నిర్వహణకు క్యాబినెట్ ఆమోదముద్ర వేయడంతో నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరుస్తున్నాయి. విద్యాశాఖ వర్గాలు, నిరుద్యోగ అభ్యర్థుల్లో బుధవారం దీనిపై సర్వత్రా చర్చ సాగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ వస్తోందని నిరుద్యోగ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎస్సీలో జిల్లాల వారీగా ఎన్ని పోస్టులు ఉన్నాయి. వీటిలో క్యాడర్ వారీగా ఎన్ని ఉన్నాయనే దానిపై అభ్యర్థులు ఆరా తీశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన నియామకాల ప్రక్రియ ఉండటంతో ఉపాధ్యాయ కొలువు దక్కించుకునేందుకు అభ్యర్థులు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్, గిరిజన సంక్షేమశాఖ యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీలో ఖాళీలను గుర్తించారు.

సంతోషంగా ఉంది



మెగా డీఎస్సీకి ప్రభుత్వం ఆమోదించటం సంతోషంగా ఉంది. డీఎడ్ చేసి గతంలో డీఎస్సీ రాశాను. ప్రస్తుతం బీఈడీ మాథ్స్ మెథడాలజీతో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ప్రయత్నిస్తున్నాను. టీచర్ పోస్టు సాధించాలని 2019 నుంచి ప్రిపేర్ అవుతున్నాను. పోస్టుల సంఖ్య పెంచితే బాగుండేది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచిస్తుందనే నమ్మకం ఉంది.

–కొమ్ము సూర్యకళ,
ముడిదాం, విజయనగరం జిల్లా

పట్టుదలతో సిద్ధమవుతున్నా..



డీఎడ్ పూర్తి చేశాను. డీఎస్సీ ప్రిపరేషన్ కోసమని నర్సీపట్నం ప్రాంతం నుంచి నా భర్తతో కలసి విశాఖ నగరానికి వచ్చాం. ఎలాగైనా డీఎస్సీలో పోస్టు దక్కించుకోవాలనే పట్టుదలతో సిద్ధమవుతున్నాను. అనుకున్నట్లుగానే మెగా డీఎస్సీకి ప్రభుత్వం ఆమోదించటం సంతోషంగా ఉంది.

– సింగంపల్లి వెంకట లక్ష్మి,
కల్యాణలోవ, అనకాపల్లి జిల్లా

కాలేజీలకు క్రేజ్ పెరుగుతుంది



డీఎస్సీ నోటిఫికేషన్లు తరచూ ఉంటే, బీఈడీ, డీఎడ్ శిక్షణా కళాశాలలకు ఆదరణ ఉంటుంది. ఈ ప్రభుత్వ హయాంలో తప్పనిసరిగా మెగా డీఎస్సీ ఉంటుందని అంతా ఊహించినదే. నిరుద్యోగ అభ్యర్థులు కూడా అదే నమ్మకంతో ప్రిపరేషన్‌లో ఉన్నారు. మొత్తానికి అంతా శుభసూచికమే.

– గొట్టేట రవి, సీనియర్ ఫ్యాకల్టీ, ప్రభుత్వ డైట్ కాలేజీ, భీమునిపట్నం

సీఎం మాట నిలుబెట్టుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నట్లుగానే డీఎస్సీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులు అందుబాటులోకి వస్తారు. దీని వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులపై కూడా భారం తగ్గుతుంది. నోటిఫికేషన్ నాటికి ఇంకాస్తా పోస్టులు పెరుగుతాయనే నమ్మకం ఉంది.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, విశాఖ జిల్లా

రెండో టెస్ట్‌కు భారీ ఏర్పాట్లు

ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి



విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ముచ్చటగా మూడో టెస్ట్ మ్యాచ్ ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమైంది. ఇక్కడ తొలిసారిగా ఇంగ్లండ్ జట్టు టెస్ట్ మ్యాచ్ ఆడగా.. మరోసారి ఆడేందుకు ఆ దేశ జట్టు వచ్చింది. ఆతిథ్య జట్టుకు అచ్చొచ్చిన స్టేడియంగా పేరొందిన ఈ స్టేడియంలో 2016లో ఇంగ్లండ్‌తో, 2019లో దక్షిణాఫ్రికాతో ఆడి విజయాలను సొంతం చేసుకుంది. ఆయా సిరీస్‌ల్లో తొలి విజయాలతో చక్కటి ఆరంభాన్ని వైఎస్సార్ స్టేడి యం ఇచ్చింది. కాగా.. ఇంగ్లండ్ మ్యాచ్ అనగానే ఆ దేశం నుంచి మ్యాచ్‌ను తిలకించేందుకు భారీగా అభిమానులు తరలివస్తారు. టూ టైర్ సిటింగ్ ఏర్పాట్లు ఉన్న స్టేడియంలో సౌత్, నార్త్ బ్లాక్‌ల్లో అభిమానులకు అనుమతిస్తున్నారు. విద్యార్థులు, క్రికెట్ క్లబ్‌ల తరఫున ఆడే ఔత్సాహికులకు ఏసీఏ ఉచితంగానే టికెట్లను అందించే ఏర్పాట్లు చేసింది. ఇంగ్లండ్ అభిమానుల భద్రత, మ్యాచ్ నిర్వహణ, ఏర్పాట్లు, టికెట్ల విక్రయాలు తదితర అంశాలను ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి బుధవారం 'సాక్షి'కి వివరించారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇంగ్లండ్ అభిమానులకు ప్రత్యేక భద్రత

వైఎస్సార్ స్టేడియంలో రెండో టెస్ట్ మ్యాచ్ వీక్షించేందుకు ఇంగ్లండ్ అభిమానులు ఏకంగా మూడు బాక్స్‌ల టికెట్లను కొనుగోలు చేశారు. వారి భద్రతకు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్, నగర పోలీస్ కమిషనర్ రిక్కీ నిర్వహించి ఏర్పాట్లు సమీక్షించనున్నారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో హోటళ్లను బుక్ చేసుకున్నారు. స్టేడియంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. ఎండను తట్టుకునేందుకు వీలుగా సన్‌స్క్రీన్ లోషన్‌ను వారి వెంట తెచ్చుకునేందుకు వెసులుబాటు కల్పించాం.

మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

స్టేడియంలో కొత్తగా కమోడ్‌లు ఏర్పాటు చేశాం. డ్రైనేజీను ఆధునికీకరించాం. మ్యాచ్ జరిగేప్పుడు పారిశుధ్య నిర్వహణ కోసం బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థకు అప్పగించాం. ఇందుకోసం ఓ అప్లికేషన్ రూపొందించాం. స్టేడియంలో ఎప్పుడు, ఎక్కడ ఎలాంటి పరిశుభ్రత జరుగుతుందనే విషయాన్ని పర్యవేక్షిస్తాం. మ్యాట్స్, టైల్స్ తదితరాలను శుభ్రంగా ఉంచే ఏర్పాట్లు జరిగాయి.

ఫోన్‌లో టికెట్ చూపిస్తే చాలు

దేశంలోనే తొలిసారిగా డిజిటల్ టికెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. కొనుగోలు చేసిన టికెట్ ను ఫోన్‌లో చూపించి ప్రవేశం పొందవచ్చు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు టికెట్ కోసం స్టేడియానికి రావాల్సిన అవసరం లేదు. లైన్‌లో వేచి ఉండక్కర్లేదు. దీనివల్ల పేపర్‌ను సేవ్ చేయవచ్చు. ఇటీవల జరిగిన టీ–20 మ్యాచ్‌కు ఈ విధానాన్ని అమలు చేద్దామని భావించాం. అయితే ట్రయల్‌రన్ నిర్వహిస్తే బాగుంటుందని ఇప్పుడు అమలు చేస్తున్నాం. లోటుపాట్లు ఉంటే సవరించుకుని.. సక్సెస్ అయితే ఇక డిజిటల్ టికెటింగ్‌కే ప్రాధాన్యమిస్తాం.

విద్యార్థులకు ఉచిత ప్రవేశం

ఐదు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రతి రోజూ రెండు వేల మంది విద్యార్థులను ఉచితంగానే స్టేడియంలోకి అనుమతిస్తాం. అయితే విద్యార్థులు విద్యా సంస్థ ధ్రువీకరణతో రావాల్సి ఉంటుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందే రావాలని లేదు. కాకుంటే నిర్ణయించిన సంఖ్య వరకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని సంఘ అనుబంధ క్లబ్‌లకు సంబంధించి ప్రతి రోజూ 2,850 మంది ఔత్సాహిక క్రికెటర్లకు ప్రవేశం కల్పించడానికి ఏర్పాట్లు చేశాం.

20 వేల టికెట్ల విక్రయం

టెస్ట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో 15 వేల టికెట్లు, కౌంటర్ల ద్వారా 5వేల టికెట్లు అమ్ముడుపోయాయి. స్టేడియం వద్ద ఆట చివరి రోజు వరకు కౌంటర్ ద్వారా టికెట్లను విక్రయించనున్నాం. శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో అభిమానులు రావచ్చని అంచనా వేస్తున్నాం. అభిమానులు తమ వాహనాలను కల్యాణ్‌కుమార్ పార్కింగ్ లేఅవుట్, బీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి. ఉచితంగా మంచినీటిని అందిస్తాం. స్టేడియంలో ఫుడ్‌స్టాళ్లు అందుబాటులో ఉంటాయి. స్టేడియంలోకి ఎలాంటి తినుబండారాలను అనుతించం. ఉదయం ఎనిమిది నుంచే స్టేడియంలోకి అనుమతిస్తాం. రోజుకు టికెట్ ధర కనీసం రూ.100 నుంచి గరిష్ట ధర రూ.500గా నిర్ణయించినట్లు గోపీనాథ్‌రెడ్డి వివరించారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి

జేసీగా మయూర్ అశోక్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కె.మయూర్ అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జేసీగా పనిచేసిన ఆయన బదిలీపై జిల్లాకు వచ్చారు. ముందుగా ఆయన కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు గంటసేపు వివిధ అంశాలపై వీరిద్దరూ చర్చించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తన చాంబర్‌కు చేరుకుని ఉదయం 11.49 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు జేసీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, కె.భాస్కర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో కె.ఈశ్వరరావు, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్, జిల్లా రిజిస్ట్రార్ సృజన, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు త్రినాథరావు, రవిశంకర్, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు జేసీని కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. రెవెన్యూ అంశాలతోపాటు భూముల క్రమబద్ధీకరణ, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాల్లో పురోగతి సాధించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా విశ్వనాథన్ బాధ్యతల స్వీకరణ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా కె.ఎస్.విశ్వనాథన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంతకుముందు ఆయన విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు.



కమిషనర్‌కు మొక్క అందజేస్తున్న విశ్వనాథన్

భారీగా డీఎస్పీల బదిలీలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాద్‌రావును విశాఖ సిటీ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా, శ్రీకాకుళం ఎస్బీ డీఎస్పీ కె.బాలరాజును విశాఖ మెరైన్ డీఎస్పీగా, రామచంద్రాపురం ఎస్డీపీవో టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను విశాఖ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీ ఎస్.రాంబాబును ద్వారకా ఏసీపీగా, కాకినాడ దిశ డీఎస్పీ బి.ఎం.జయరాం ప్రసాద్‌ను విశాఖ సిటీ ఈస్ట్ ఏసీపీగా, కృష్ణా జిల్లా సీసీఎస్ ఏసీపీ సీహెచ్ మురళీకృష్ణను విశాఖ సిటీ నార్త్ ఏసీపీగా, ఎన్టీఆర్ సీటీసీ ఏసీపీ జి.శ్రీనివాసరావును విశాఖ సిటీ ట్రాఫిక్ ఏసీపీగా నియమించారు. విశాఖ ఈస్ట్ ఏసీపీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తిని తాడేపల్లిగూడెం ఎస్డీపీవోగా, విశాఖ ట్రాఫిక్ ఏసీపీ ఎం.జాన్ మనోహర్‌ను ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, సీఎస్‌బీ ఏసీపీ వై.గోవింద్‌రావును కోనసీమ దిశ డీఎస్పీగా, సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఏసీపీ ఎస్.బాపూజీని అన్నమయ్య జిల్లా దిశ డీఎస్పీగా, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథ్‌రావును శ్రీకాకుళం ఎస్బీ డీఎస్పీగా, సిటీ సెబ్ డీఎస్పీ ఎ.వెంకటరావును గ్రేహౌండ్స్ డీఎస్పీగా, మెరైన్ ఏసీపీగా పనిచేసి ఇటీవల విశాఖ సిటీ సీపీ కార్యాలయానికి అటాచ్ చేసిన ఏసీపీ ఎం.శ్రీనివాసరావును నూజివీడు ఎస్డీపీవోగా బదిలీ చేశారు.

- ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండ్స్‌ను కూడా బదిలీ చేశారు. విజయనగరం ఏపీఎస్పీ 5వ బెటాలియన్‌గా పనిచేస్తున్న వి.నారాయణరావును విశాఖ ఏపీఎస్పీ 16వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా, అక్కడ పనిచేస్తున్న జి.లక్ష్మీనారాయణను విజయనగరం 5వ బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్‌గా, మంగళగిరి 6వ ఏపీఎస్పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సీహెచ్ వీవీ మల్లికార్జునను ఏపీఎస్పీ 16 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా, అక్కడ పనిచేస్తున్న కె.వెంకటేశ్వరావును విజయనగరం ఏపీఎస్పీ 5వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా నియమించారు. మంగళగిరి 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్ డి.దేవానంద్‌రావును 16వ ఏపీఎస్పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్‌గా, అక్కడ పనిచేస్తున్న వి.వి.వి సత్యనారాయణను కాకినాడ 3వ బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్‌గా బదిలీ చేశారు. కాకినాడ 3వ ఏపీఎస్పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్ పి.సత్యంను 16వ బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్‌గా, అక్కడ పనిచేస్తున్న జి.వి ప్రభాకర్‌రావును విజయనగరం 5వ బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్‌గా బదిలీ చేశారు.

58 మంది తహసీల్దార్లకు స్థానచలనం

మహారాణిపేట: సాధారణ ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి విశాఖ జిల్లాలో 58 మంది తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. వీరిని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్(సీసీఎల్ఎ) జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 30లోపు రిటైర్ అవుతున్న మాడుగుల తహసీల్దార్ వీవీవీ గోపాలకృష్ణ, అనకాపల్లి జిల్లా మేజిస్ట్రీయల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.ఎ.శ్రీనివాస్, అనకాపల్లి తహసీల్దార్ వీవీఎల్ఎస్ గంగాధర్, సబ్బవరం తహసీల్దార్ బి.సత్యనారాయణ, మునగపాక తహసీల్దార్ వి.ప్రకాశరావుకు బదిలీ కాలేదు. జిల్లాలో మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి కాని మహారాణిపేట తహసీల్దార్ టి.ఆనందకుమార్, గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లికి బదిలీ కాలేదు. విశాఖ కలెక్టరేట్‌లో ఏవోలు కె.వి.ఈశ్వరరావు, పి.రామారావును శ్రీకాకుళం జిల్లాకు, కలెక్టరేట్ మెజిస్ట్రేట్ సెక్షన్ సూపరింటెండెంట్ వి.సుజాతను పార్వతీపురం మన్యం జిల్లాకు, భీమిలి తహసీల్దార్ సిహెచ్‌వి రమేష్‌ను విజయనగరం జిల్లాకు, ఆనందపురం తహసీల్దార్ ఎల్.రామారావును శ్రీకాకుళం జిల్లాకు, పద్మనాభం తహసీల్దార్ కె.వేణుగోపాల్‌కు శ్రీకాకుళం జిల్లాకు, రూరల్ తహసీల్దార్ వి.రమణయ్యకు విజయనగరం జిల్లాకు, సీతమ్మధార తహసీల్దార్ ఎం.ఆనందకుమార్‌కు పార్వతీపురం మన్యం జిల్లాకు, గోపాలపట్నం తహసీల్దార్ కె.జయకు పార్వతీపురం మన్యం జిల్లాకు, పెందుర్తి తహసీల్దార్ పి.శ్యాం ప్రసాద్‌కు విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. ములగాడ తహసీల్దార్ డి.వీరభద్రరావు శ్రీకాకుళం జిల్లాకు, పెదగంట్యాడ తహసీల్దార్ పి.రమాదేవికి విజయనగరం జిల్లాకు, విశాఖ ఆర్డీవో ఆఫీసు ఏవో ఎ.మనోరంజనీకి శ్రీకాకుళం జిల్లాకు, భీమిలి ఆర్డీవో ఆఫీసు ఏవో జె.తారకేశ్వరిని శ్రీకాకుళం జిల్లాకు, స్పెషల్ తహసీల్దార్ బిటీవీ రామారావును శ్రీకాకుళం జిల్లాకు, స్పెషల్ తహసీల్దార్ ఎంవీకెఎస్ రవిని శ్రీకాకుళం జిల్లాకు, స్పెషల్ తహసీల్దార్ వి.శ్యామ్ కుమార్‌కు శ్రీకాకుళం జిల్లాకు, విజిలెన్సు తహసీల్దార్ బి.నాగజ్యోతి శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు.

డిప్యూటీ కలెక్టర్లకు బదిలీ

మహారాణిపేట: జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ కె.జ్ఞానవేణికి గతంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా ఇచ్చిన పోస్టును రద్దు చేసి ఎస్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏపీఐఐసీ భూసేకరణ అధికారిగా ఉన్న టీఈఎం రాజును బదిలీ చేశారు. అతని స్థానంలో జి.వి.సత్యవాణికి బాధ్యతలు అప్పగించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.రమణమూర్తిని ఏఎస్ఆర్ జిల్లా రెవెన్యూ అధికారిగా నియమించారు. సింహాచలం దేవస్థానం ఎస్డీసీ కె.వి.రామలక్ష్మిని బదిలీ చేసి కేఎస్ఈజెడ్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆమె స్థానంలో కె.గీతాంజలిని నియమించారు. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ డి.ప్రమీలా గాంధీని బదిలీ చేసి బొబ్బిలి భూసేకరణ అధికారిగా నియమించారు. ఆమె స్థానంలో సీహెచ్ గౌతమికుమారికి బాధ్యతలు అప్పగించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి : డీసీపీ–1

అల్లిపురం: ఇటీవల జరిగిన బదిలీల్లో నగర శాంతిభద్రతల డీసీపీ–1గా వీఎస్ మణికంఠ చందోలును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బుధవారం ప్రస్తుత డీసీపీ–1 కంచి శ్రీనివాసరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. డీసీపీ–1గా బాధ్యతలు స్వీకరించిన మణికంఠ చందోలు శ్రీకాకుళం జిల్లా ఎస్ఈబీలో అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహించేవారు.

దివ్యాంగులు, వయో వృద్ధుల సమస్యలపై సత్వర చర్యలు

కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: దివ్యాంగులు, వయో వృద్ధులకు సంబంధించిన సమస్యలపై అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. జిల్లా స్థాయి వృద్ధుల కమిటీ, జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ సమావేశాలు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయో వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్సు కేసులకు సంబంధించి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. వృద్ధులకు హాస్పటల్స్, ముఖ్య ఆలయాలు, పోస్టాఫీసుల్లో ప్రత్యేక క్యూలు ఏర్పాటుకు సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలోని వయో వృద్ధుల డేటా సేకరించి ఉంచాలని, వయో వృద్ధుల ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సివిల్ జడ్జి వెంకట శేషమ్మ, శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి, డీఈవో చంద్రకళ పాల్గొన్నారు.

ఎంపీడీవోలకు నియామక ఉత్తర్వుల అందజేత

మహారాణిపేట: ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఏడుగురు ఎంపీడీవోలకు బుధవారం జెడ్పీ సీఈవో పి.పోలినాయుడు నియామక ఉత్తర్వులు అందజేశారు. విశాఖ జిల్లా నుంచి బదిలీ అయిన 22 మంది ఎంపీడీవోలను మంగళవారం ఆయన రిలీవ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ జిల్లాల నుంచి వచ్చిన వారికి పోస్టింగులు ఇస్తున్నారు. తొలుత విజయనగరం జిల్లా రామభద్రపురం ఎంపీడీవో కె.రమామణికి చోడవరం ఎంపీడీవోగా పోస్టింగ్ కల్పించి, ఉత్తర్వులు అందజేశారు.

ఏడీసీపీ(ఎస్‌బీ)గా వెంకటరావు

విశాఖ సిటీ: విశాఖ ఏడీసీపీ(స్పెషల్ బ్రాంచ్)గా ఎస్.వెంకటరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న ఇ.నాగేంద్రుడిని ఏసీబీ ఏఎస్పీగా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 21 మంది ఏఎస్పీలను బదిలీ చేశారు. ఇందులో విజయనగరం సెబ్‌లో పనిచేస్తున్న వెంకటరావును విశాఖ ఏడీసీపీ(ఎస్‌బీ)గా నియమించారు.

ఇంటెలిజెన్స్‌కు డీసీపీ-2 ఆనందరెడ్డి

విశాఖ సిటీ: విశాఖ డీసీపీ–2 కె.ఆనందరెడ్డికి బదిలీ జరిగింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనను ఇక్కడి నుంచి ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు. ఆనందరెడ్డి టాస్క్‌ఫోర్ ఎస్ఐ నుంచి డీసీపీ స్థాయి వరకు విశాఖలో విధులు నిర్వర్తించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయనకు ఇంటెలిజెన్స్‌కు స్థానచలనం కలిగింది.

మిలాన్‌కు తీరప్రాంతం సుందరీకరణ

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: నగరంలో మిలాన్–2024 నిర్వహిస్తున్న సందర్భంగా బీచ్ తీర ప్రాంతాన్ని సుందరీకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. మిలాన్–2024 ఈ నెల 19 నుంచి 27 వరకు ఆర్కేబీచ్ విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌కు ఎదురుగా జరుగుతున్నందున ఆ ప్రాంతాన్ని బుధవారం నేవల్ అధికారి కెప్టెన్ దివాకర్, నేవల్ కోస్టల్ బ్యాటరీ ఆఫీసర్ ఇన్‌చార్జ్ మనోజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిలాన్‌లో పాల్గొనేందుకు సుమారు 50 దేశాల నుంచి అతిథులకు నగరానికి వస్తున్నందున తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్కేబీచ్ రోడ్డులో అవసరమైన చోట్ల రోడ్ల మరమ్మతులు, గోడలకు, ఎలక్ట్రికల్ స్తంభాలకు పెయింటింగ్, పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు, విద్యుత్ లైట్లు, బీటీ రోడ్లలో జీబ్రా క్రాసింగ్ మార్కింగ్, పార్కింగ్ కోసం రోడ్డు మ్యాపింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. పారిశుధ్య పనులు, బీచ్‌రోడ్డులో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణతో పాటు మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని అదనపు కమిషనర్, ప్రధాన వైద్యాధికారిని కమిషనర్ ఆదేశించారు. బీచ్‌రోడ్డులో అందమైన మొక్కలతో పాటు పచ్చదనాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.



మిలాన్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

రోడ్డు పనుల పరిశీలన : మిలాన్ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం కమిషనర్ గ్రీన్‌పార్క్ నుంచి సెవెన్‌హిల్స్ ఆసుపత్రి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్ పనులు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరా ప్రియదర్శినీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. 15 రోజుల్లోగా అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధాన ఇంజనీరు రవికృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజనీర్లు సత్యనారాయణరాజు, కేవీఎస్ రవి, అదనపు కమిషనర్లు డాక్టర్ వై శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు సంతోషి, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా భారత్, ఇంగ్లండ్ జట్ల సాధన


ప్రాక్టీస్ చేస్తున్న సిరాజ్


వ్యాయామాలు చేస్తున్న భారత క్రికెటర్లు

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు బుధవారం ముమ్మరంగా సాధన చేశారు. ఈ స్టేడియంలో ఇప్పటివరకు రెండు టెస్ట్ మ్యాచ్‌లు జరగ్గా.. 2016లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 246 పరుగుల తేడాతో విజయం సాధించింది. 2019లో సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 203 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌ల్లో భారత్ జట్టు ఆడిన రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆటను డిక్లేర్ చేయడం విశేషం. విశాఖలో హ్యాట్రిక్ విజయం నమోదు చేసేందుకు భారత ఆటగాళ్లు తీవ్రంగా శ్రమించారు. ఉదయం సెషన్‌లో ఇంగ్లండ్ జట్టు సభ్యులు ప్రాక్టీస్ చేయగా.. మధ్యాహ్నం నుంచి భారత ఆటగాళ్లు ప్రధాన స్టేడియంలో వ్యాయామాలు చేశారు. అనంతరం బీ గ్రౌండ్‌లోని నెట్స్‌లో ప్రాక్టీస్ చేశారు. యువ బ్యాటర్లు రివర్స్ స్వీప్ షాట్లపై ఎక్కువగా సాధన చేశారు. గురువారం ఉదయం సెషన్‌లో భారత్ జట్టు, మధ్యాహ్నం ఇంగ్లండ్ జట్టు ప్రాక్టీస్ చేయనుంది.

గోల్ఫ్ ఆడిన ఇంగ్లండ్ క్రికెటర్లు

ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెటర్లు ఆటవిడుపుగా బ్యాట్‌కు బదులు గోల్ఫ్ క్లబ్‌తో హిట్టింగ్స్ చేశారు. ఇంగ్లండ్ టాపార్డర్ బ్యాటర్లు బెన్ డకెట్, ఓల్లీ పోప్ విశాఖలోని ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ కోర్స్‌లో కాసేపు తమ గోల్ఫ్ ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు.


గోల్ఫ్ ఆడుతున్న ఇంగ్లండ్ క్రికెటర్ ఓలీ పోప్


ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్


కోచ్ ద్రావిడ్‌తో కెప్టెన్ రోహిత్


నెట్స్‌లో ఇంగ్లండ్ క్రికెటర్ల సాధన



ప్రాక్టీస్ చేస్తున్న ఇంగ్లండ్ క్రికెటర్లు



అప్పన్న సన్నిధిలో క్రికెటర్ కులదీప్


అప్పన్న ఆలయంలో భారత క్రికెటర్ కులదీప్ యాదవ్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని బుధవారం భారత క్రికెటర్ కులదీప్ యాదవ్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపికను ఈవో శ్రీనివాసమూర్తి ఆయనకు అందించారు.

విశ్వనాథన్ సేవలు ప్రశంసనీయం

సీతంపేట: అద్భుత పనితీరు కనబరిచి అందరి మనసులు గెలుచుకున్న జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. విశాఖ జిల్లా సమగ్రాభివృద్ధి, లక్ష్యాల సాధనలో ఆయన కీలపాత్ర పోషించారని కొనియాడారు. ఇప్పటివరకు జేసీగా బాధ్యతలు నిర్వర్తించిన కె.ఎస్.విశ్వనాథన్ జీవీఎంసీ ఏడీసీగా బదిలీపై వెళ్లిన నేపథ్యంలో బుధవారం ఓ హోటల్‌లో రెవెన్యూ అసోసియేషన్, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మట్లాడుతూ విశ్వనాథన్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. విశ్వనాథన్ ఎన్నో విషయాల్లో ఓ సోదరుడిలా తోడ్పాటు అందించారని, క్లిష్టమైన సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. తన సర్వీసులో ఇంత మంచి వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన వ్యక్తిని చూడలేదని కితాబిచ్చారు. కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు తనకు సంపూర్ణ సహకారం అందించారని, వారికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ మల్లికార్జున అన్ని విషయాల్లో అండగా నిలిచారని, లక్ష్యాల సాధనలో తోడుగా ఉన్నారన్నారు. నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.మయూర్ అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


విశ్వనాథన్ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు బుధవారం ఏయూ గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ స్థాయిల్లో విజేతగా నిలిచిన జట్లు జిల్లా స్థాయి పోటీల్లో తలపడున్నాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో మెన్, వుమెన్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రారంభించారు. వీరు కాసేపు క్రికెట్ ఆడి ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, ఏపీడీ బి.శ్రీనివాసరావు, ఎంవి మాణిక్యాలు, ఐ.వెంకటేశ్వరరావు, సిహెచ్ ప్రతాప్‌కుమార్, సాయిసంహిత, డీఎస్‌డీవో జూన్ గాలియట్ తదితరులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ఆర్ఐవోగా మురళీధర్


మురళీధర్

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐవో)గా పి.మురళీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇంటర్‌బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఆర్ఐవో రాయల సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో అనకాపల్లి జిల్లా సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మురళీధర్‌ను నియమించారు. గురువారం ఆర్ఐవోగా విధుల్లో చేరనున్నారు.

6 నుంచి ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు

- క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాల కల్పన
- అధికారులతో జేసీ మయూర్ అశోక్ సమీక్ష

మహారాణిపేట: విశాఖ వేదికగా ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. తన చాంబర్‌లో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, డీఎస్‌డీవో జూన్ గాలియట్‌తో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాస్థాయి పోటీల నిర్వహణ, ఇతర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు రానున్న నేపథ్యంలో వారందరికీ తగిన వసతులు కల్పించాలన్నారు. క్రీడా మైదానాలను పరిశీలించి.. ఏమైనా చర్యలు చేపట్టాల్సి ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. టిడ్కో కాలనీలు, జీవీఎంసీ కమ్యూనిటీ భవనాల్లో క్రీడాకారులకు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భోజనాలు, ఇతర సదుపాయాల కల్పనలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతం చేయాలని సూచించారు.


ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జేసీ మయూర్ అశోక్

ఉద్యోగుల సేవలు అభినందనీయం

- జీవీఎంసీ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: విధి నిర్వహణలో ఉద్యోగులు ఎన్నో సేవలు అందించారని, పదవీ విరమణ అనంతరం ఆనందదాయకమైన జీవితం గడపాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జీవీఎంసీలో పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులను బుధవారం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సత్కరించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవలు ఎనలేనివని, వారికి కుటుంబ సభ్యులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఉద్యోగుల సేవలకు విలువ కట్టలేమని, వారికి ఇప్పుడు చేస్తున్నది చిరు సత్కారమన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ సెటిల్‌మెంట్ సొమ్ము రూ.1.15 కోట్లను అందించే ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా జీవీఎంసీలో సేవలు అందించి పదవీ విరమణ పొందడం గొప్ప వరంగా భావించాలన్నారు. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏపీఎంఈఎస్ఏ ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, జెమ్స్ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఏవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో అధికారులు

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సత్కారం

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తించి.. పదవీ విరమణ చేసిన ఐదుగురు ఉద్యోగులను పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ బుధవారం సత్కరించారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆర్ఎస్ఐ ఆర్.వెంకటరావు, పద్మనాభం ఏఎస్ఐ బీవీఆర్ నాగభూషణం, ఆనందపురం ట్రాఫిక్ ఏఎస్ఐ టి.తారకేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ ఏఎస్ఐ పీవీ శ్రీనివాసరావు, మహారాణిపేట ఏఎస్ఐ కె.వాసు పదవీ విరమణ చేశారు. వీరంతా 40 ఏళ్ల పాటు అద్భుతమైన సేవలందించారని, పదవీ విరమణ అనంతరం జీవితాన్ని కుటుంబసభ్యుల మధ్య ఉల్లాసంగా గడపాలని సీపీ ఆకాంక్షించారు. వారిని సత్కరించి ఉన్నతాధికారుల సమక్షంలో వీడ్కోలు పలికారు.


పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో సీపీ రవిశంకర్

జీసీసీ కార్యాలయ సహాయకులకు పదోన్నతి

విశాఖ సిటీ: గిరిజన సహకార సంస్థలో రాష్ట్రంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో 20 నుంచి 30 ఏళ్లకు పైగా పనిచేస్తున్న 21 మంది ఎంసీడబ్ల్యూ/కార్యాలయ సహాయకులకు సేల్స్‌మెన్‌గా పదోన్నతి లభించింది. జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, వీసీ అండ్ ఎండీ జి.సురేష్‌కుమార్ చేతుల మీదుగా సిబ్బందికి జీసీసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం పదోన్నతి పత్రాలు అందజేశారు. ఈ పదోన్నతులు పొందిన 21 మందిలో 17 మంది షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు ఉన్నారు. తమ అర్హతలు, సేవలు గుర్తించి పదోన్నతులు కల్పించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీసీసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సంస్థలో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కేడర్ పదోన్నతుల ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు. సంస్థ జనరల్ మేనేజర్ జె.యూస్టస్, డివిజనల్ మేనేజర్ రంపచోడవరం జి.పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.


పదోన్నతి పొందిన సిబ్బందితో జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, ఎండీ సురేష్‌కుమార్

వాల్తేర్ డివిజన్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పర్యటన

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ బుధవారం వాల్తేర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా డివిజనల్ పి వే శిక్షణా కేంద్రాన్ని సందర్శించి, శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న తరగతి గదులు, సౌకర్యాలను పరిశీలించారు. పచ్చదనం పెంపొందించడంలో భాగంగా ఈ ప్రాంగణలో మొక్కలు నాటారు. అనంతరం డివిజనల్ రైల్వే హాస్పటల్‌లో తనిఖీలు చేశారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇక్కడ నూతనంగా నిర్మించిన కేబిన్ కాంప్లెక్స్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్ జోతి సమక్షంలో ప్రారంభించారు. డీఆర్ఎం కార్యాలయంలో డివిజనల్ పరిధిలో జరుగుతున్న పనులపై డివిజన్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు.


డివిజనల్ పి వే శిక్షణ కేంద్రంలో అభ్యర్థులతో జీఎం మనోజ్‌శర్మ, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

రేపు డీసీసీబీ మహాజన సభ

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 59వ మహాజన సభ ఈ నెల 2న ఉదయం 11 గంటలకు మద్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు డీసీసీబీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 30 శాఖలు, వాటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 98 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు మహాసభకు హాజరు కానున్నారు. రైతాంగానికి మరింత మేలు చేసేలా.. భవిష్యత్‌లో కార్యకలాపాలను మరింత విస్తృతపరిచేలా మహాసభలో చర్చించనున్నట్లు బ్యాంకు సీఈవో డి.వి.ఎస్. వర్మ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ మాసాంతం వరకు బ్యాంకు సాధించిన ప్రగతిపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. మహాజన సభకు సంఘ చైర్‌పర్సన్/అధ్యక్షులు మాత్రమే హాజరుకావాలన్నారు.

మరికొంత కాలం ప్రత్యేక రైళ్లు పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రస్తుతం నడుస్తున్న పలు స్పెషల్ రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- విశాఖపట్నం-సికింద్రాబాద్ (08579) వీక్లీ స్పెషల్ ప్రతీ బుధవారం రాత్రి 7 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈ నెల 7 నుంచి మార్చి 27వ తేదీ వరకు పొడిగించారు. సికింద్రాబాద్-విశాఖపట్నం(08580) వీక్లీ స్పెషల్ ప్రతీ గురువారం సికింద్రాబాద్‌లో రాత్రి 7.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 28వ తేదీ వరకు పొడిగించారు.
- విశాఖపట్నం-తిరుపతి(08583) వీక్లీ స్పెషల్ ప్రతీ సోమవారం రాత్రి 7 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 25వ తేదీ వరకు పొడిగించారు. తిరుపతి-విశాఖపట్నం(08584) వీక్లీ స్పెషల్ ప్రతీ మంగళవారాల్లో తిరుపతిలో రాత్రి 9.55 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.15గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 26 వరకు పొడిగించారు.
- విశాఖపట్నం-ఎస్ఎంవీ బెంగళూరు (08543) వీక్లీ స్పెషల్ ప్రతీ ఆదివారాలలో విశాఖపట్నంలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయల్దేరి మరుసటిరో రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 31వ తేదీ వరకు పొడిగించారు. ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖపట్నం(08544) వీక్లీ స్పెషల్ ప్రతీ సోమవారాలలో మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు ఏప్రిల్ 1వ తేదీ వరకు పొడిగించారు.
- భువనేశ్వర్-తిరుపతి(02809) వీక్లీ స్పెషల్ ప్రతీ శనివారాలలో మధ్యాహ్నం 1.30 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరి అదే రోజు రాత్రి 7.35 గంటలకు దువ్వాడ చేరుకొని అక్కడ నుంచి 7.37 గంటకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుపతి-భువనేశ్వర్ (02810) వీక్లీ స్పెషల్ ప్రతి ఆదివారాలలో రాత్రి 8.15 గంటలకు తిరుపతిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 9.32 గంలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.25 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 31వ తేదీ వరకు పొడిగించారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల కోసం పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

- భువనేశ్వర్-బెంగళూరు(12845) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్(12846) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 5 నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-చెన్నై సెంట్రల్(12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 2వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-తిరుపతి(22871) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో తిరుపతి-భువనేశ్వర్(22872) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 5వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-పుణే (22882) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో పుణే-భువనేశ్వర్(22881) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- సంబల్‌పూర్-నాందేడ్(20809) నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 2వ తేదీ నుంచి 26వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో నాందేడ్ -సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 3వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- సంబల్‌పూర్-ఈరోడ్(08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 7వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ఈరోడ్-సంబల్‌పూర్(08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 9వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- విశాఖ-బెనారస్ (18311) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో బెనారస్-విశాఖపట్నం (18312) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో గుణుపూర్ -విశాఖపట్నం (08521) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసి, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.